Tuesday, May 16, 2017
10:48

# జనం నెత్తిన
# ఆక్వా పిడుగు


ఆక్వా కాలుష్యానికి వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజాగ్రహం

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ కమిటీ

# ముందుమాట

కోస్తా జిల్లాల్లో రొయ్యలు, చేపల చెరువులు మితిమీరి విస్తరించడంతో అనేక సమస్యలు ముందుకొస్తున్నాయి. ఆక్వా సాగు పెరుగుతున్న గ్రామాల్లో ప్రజలకు త్రాగడానికి మంచినీరు కూడా లభించడం లేదు. పర్యావరణం కలుషితమై చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులతోపాటు ప్రమాదకరమైన క్యాన్సర్ వంటివి ప్రబలుతున్నాయని ప్రజలు భయపడుతున్నారు. ఉపాధి లభించక పేదలు ఊళ్ళొదిలి వలసలు పోతున్నారు. సన్న, చిన్నకారు రైతులు భూములు కోట్ల రూపాయల పెట్టుబడితో చెరువులు త్రవ్వే పెత్తందార్ల చేతుల్లోకి పోతున్నాయి. దళితులు, ఇతర బలహీన వర్గాలకు చెందిన అస్సైన్డ్ భూములను సంపన్నులు అన్యాక్రాంతం చేస్తున్నారు. గ్రామ సీమల్లో భూసంబంధాల పొందికతోపాటు ఆర్థిక సామాజిక అంతరాలు తీవ్రవుతున్నాయి.

రాష్ట్రాన్ని ఆక్వా హబ్‌గా మారుస్తానని ముఖ్యమంత్రి ఊదరగొట్టడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలు, జి.వో.లను ఉల్లంఘించి యధేచ్ఛగా రొయ్యలు, చేపల చెరువుల త్రవ్వకం సాగిపోతోంది. పంట కాలువలు, డ్రెయిన్లు కబ్జాకు గురికావడం లేదా కాలుష్యమయం కావడం సర్వ సాధారణమైపోయింది. ఆక్వా ప్రోసెసింగ్ ప్లాంట్లలో విషవాయువుల వల్ల కార్మికులు మరణించడం, పెద్ద సంఖ్యలో అస్వస్థులు కావడం జరుగుతోంది. కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు లభించడం లేదు.

రొయ్యలు, చేపల చెరువులు పెరుగుతున్న గ్రామాల్లోని జనం, ప్రోసెసింగ్ ప్లాంట్లలో కార్మికులు, ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు ఆక్వా కాలుష్య ప్రమాదానికి వ్యతిరేకంగా ఆందోళనలు సాగిస్తున్నా ప్రభుత్వం రెండంకెల అభివృద్ధి వంటి మాటల మాటున యజమానుల కొమ్ముగాస్తున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లోని సుమారు 50 మండలాల ప్రజలు ఊళ్ళను ఖాళీ చేయాల్సిన దుస్థితి దాపురిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగం పరిస్థితి, పర్యవసానాలను క్లుప్తంగా వివరిస్తూ ఈ చిరు పుస్తకాన్ని మీ ముందుకు తెస్తున్నాం.

– ప్రచురణకర్తలు

# జనం నెత్తిన ఆక్వా పిడుగు

అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌ను ఆక్వా హబ్ (రొయ్యలు, చేపల చెరువుల మయం)గా మార్చుతానని రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే చెబుతున్నారు. ఇప్పటికే పొలాలు రొయ్యలు, చేపల చెరువులుగా మారిన గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటి కటకట ఏర్పడడమేగాక పేదలు వృత్తి, ఉపాధి కోల్పోయి వలసలు పోవాల్సి వస్తోంది. పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోంది. ప్రజల ఆరోగ్యం దెబ్బతిని వైద్యానికి వేలు, లక్షల రూపాయలు ఖర్చు చేయవలసి వస్తోంది. ఆక్వా మూలంగా గ్రామ ఆర్థిక, సామాజిక, రాజకీయ జీవనంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. నష్టపోతున్న ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం మాత్రం రొయ్యలు, చేపల చెరువుల యజమానుల కొమ్ముగాస్తోంది.

మత్స్య ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో వుంది. ఎగుమతుల్లోనూ 77% వాటా మన రాష్ట్రానిదే. చేపలు, రొయ్యల ద్వారా అటు ఉత్పత్తిదార్లకు, ఇటు ప్రోసెసింగ్ ప్లాంటు యజమానులకు భారీగా లాభాలు వస్తున్నాయి. విదేశీ మారక ద్రవ్యంతో పాటు ప్రభుత్వాలకు పన్ను ఆదాయం కూడా లభిస్తోంది. రెండంకెల వృద్ధిపేరిట తెలుగుదేశం ప్రభుత్వం ఆక్వా రంగాన్ని మితిమీరి ప్రోత్సహిస్తున్నది. ప్రజల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కల్గుతోంది. పాలకపార్టీ, ప్రభుత్వం వత్తాసుతో ఆక్వా యజమానులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలు, అమలులో వున్న జి.వోలు సైతం యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఈ నేపథ్యంలో చేపలు, రొయ్యల చెరువులు–ఆ ఉత్పత్తుల్ని ప్రోసెస్ చేసే ప్లాంట్లు గురించి – వాటి పర్యవసానాలను పరిశీలిద్దాం.

## రాష్ట్రంలో ప్రస్తుత ఆక్వా రంగ పరిస్థితి

చేపలు, రొయ్యల ఉత్పత్తి ప్రధానంగా క్రింది రూపాల్లో జరుగుతోంది. సముద్రంలో ప్రకృతి సిద్ధంగా వచ్చే రొయ్యలు, చేపలు. సముద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోపు ఉప్పునీటి చెరువుల్లో (బ్రాకిష్ వాటర్) పెంచే రొయ్యలు. మంచినీటి చెరువుల్లో పెంచే చేపలు, రొయ్యలు. మత్స్య ఉత్పత్తులను స్థూలంగా ఈ ఐదు కేటగిరీల్లో చూస్తారు.

మన రాష్ట్రానికి 974 కి.మీ. పొడవున సముద్రతీరం వుంది. దేశంలో చేప, రొయ్యల ఉత్పత్తిలో మొదటి స్థానంలో వుండడమేగాక చెరువు రొయ్యల ఉత్పత్తిలో 70%

## రాష్ట్రంలో మత్స్య ఉత్పత్తులు (2014-15 సం॥ - టన్నులలో)

| సంఖ్య | జిల్లా | సముద్ర చేపలు | సముద్ర రొయ్యలు | ఉప్పునీటి రొయ్యలు | మంచినీటి రొయ్యలు | మంచినీటి చేపలు | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | కృష్ణా | 28037 | 11906 | 13801 | 24585 | 535542 | 613871 |
| 2 | పశ్చిమగోదావరి | 10583 | 1222 | 31550 | 20454 | 548807 | 612616 |
| 3 | నెల్లూరు | 71558 | 11053 | 26319 | 40081 | 46259 | 195270 |
| 4 | తూర్పుగోదావరి | 85078 | 16651 | 11373 | 15528 | 30771 | 159401 |
| 5 | విశాఖపట్నం | 85620 | 11700 | 3265 | 7130 | 8461 | 116176 |
| 6 | గుంటూరు | 31460 | 7454 | 7594 | 3326 | 30381 | 80215 |
| 7 | శ్రీకాకుళం | 55517 | 1446 | 821 | 1657 | 10255 | 69696 |
| 8 | ప్రకాశం | 22789 | 6820 | 10301 | 7050 | 17924 | 64884 |
| 9 | విజయనగరం | 15607 | 900 | 138 | 1210 | 10300 | 28155 |
| | మొత్తం | 406249 | 69152 | 105162 | 121021 | 1238700 | 1940284 |

(రాష్ట్ర ప్రభుత్వ మత్స్యశాఖ వెబ్‌సైట్)

రాష్ట్రంలోనే జరుగుతోంది. 2014-15లో 19లక్షల టన్నులుగా ఉన్న మత్స్య ఉత్పత్తిని 2019-20 నాటికి 42లక్షల టన్నులకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం తన ఫిషరీస్ పాలసీ (2015)లో ప్రకటించింది.

సముద్ర చేపలు, రొయ్యలు పట్టి తెచ్చే సాంప్రదాయ మత్స్యకారులకు ప్రభుత్వ సహకారం నామమాత్రంగానే వుంటోంది. ఏటా ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు రెండు నెలలపాటు సముద్రంలో వేటను నిషేదిస్తున్న ప్రభుత్వం ఆ సమయంలో మత్స్యకారులను ఆదుకొనేందుకు తగిన చర్యలు చేపట్టడంలేదు. ఉపాధి కోల్పోయే మత్స్యకారులకు రూ.4000/- సహాయం ప్రకటించినా చెల్లింపులో తీవ్ర అన్యాయం జరుగుతోంది. గత ఏడాది 60 వేల మందికి చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంకా ఇప్పటికీ సుమారు 10 వేల మందికి సహాయం చెల్లించలేదు.

పొరుగున ఉన్న పుదుచ్చేరి ప్రభుత్వం గత ఏడాది ప్రతి మత్స్యకారునికి సహాయంగా రూ.5,000/-లతోపాటు 45 కిలోల బియ్యం ఇచ్చింది. తూర్పు గోదావరి జిల్లాను ఆనుకొని ఉన్న యానాం ప్రాంతంలో మత్స్యకారులు ఆ సహాయం పొందుతుంటే ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు కేవలం రూ.4000లతోనే సరిపెట్టుకోవలసిన దుస్థితి. వీరికి బియ్యం కూడా రావు. తమిళనాడు ప్రభుత్వం 2015లో ఆర్థిక సహాయంతోపాటు అదనంగా సాదర ఖర్చు నిమిత్తం ప్రతి మత్స్యకారునికి రోజుకు మూడు రూపాయల చొప్పున మంజూరు చేసింది. ఎన్నో విషయాలలో ఇతర రాష్ట్రాలతో పోలిక తెచ్చి తాము గొప్పగా చేస్తున్నట్టు చెప్పే ప్రభుత్వాధినేతలు మత్స్యకారులకు కనీసం పుదుచ్చేరికి తగ్గకుండా సహాయం అందించే విషయం ఆలోచించడం లేదు. 2015లో 86,948మందికి సహాయం అందజేస్తామని (జివో 156) ప్రకటించారు. ఈ ఏడాది సహాయం అందించే మత్స్యకారుల సంఖ్యను 60 వేలకు తగ్గించడం మరీ ఘోరం. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అక్కౌంట్ మున్నగువాటితో లింక్ పెట్టి సహాయం అందించే మత్స్యకార్ల సంఖ్యను కుదించేస్తున్నారు. వేట నిషేదం అమలులోకి వచ్చి నెల దాటిపోగా అధికార్లు ఇప్పుడు సర్వే చేస్తున్నారు. అలాగే మత్స్యకారులకు లైఫ్‌జాకెట్లు, ఇతర సౌకర్యాలు, రాయితీల కల్పన స్వల్పంగానే వున్నది.

ఉప్పునీటి రొయ్యల పెంపకం - ప్రధానంగా సముద్రానికి 2 కి.మీ. దూరం లోపలే ఉన్నవి - కేంద్ర ఆక్వా కల్చర్ ఆథారిటీ అనుమతితో జరగాలి. ప్రస్తుతం 92 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతున్నదని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. వాస్తవంలో అంతకు రెట్టింపు వుంటుంది. ఇక మంచినీటి చేపలు, రొయ్యలు పెంపకంలోనే రాష్ట్ర ప్రభుత్వ జోక్యం ప్రోత్సాహం ఎక్కువగా వుంది. నిబంధనల ఉల్లంఘన కూడా వీటిలోనే విపరీతంగా జరుగుతోంది. పత్రికా విలేకర్ల ద్వారా పొందిన సమాచారం ప్రకారం జిల్లాలవారీగా ఆక్వా సాగు క్రింది విధంగా వుంది.

| సం. | జిల్లా | అధికారికం | | | అనధికారికం | | | మొత్తం | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | చేపలు | రొయ్యలు | మొత్తం | చేపలు | రొయ్యలు | మొత్తం | చేపలు | రొయ్యలు | మొత్తం |
| 1 | కృష్ణా | 104000 | 37000 | 141000 | 69000 | 32000 | 101000 | 173000 | 69000 | 242000 |
| 2 | ప॥ గోదావరి ◆ | - | - | 78360 | - | - | 57876 | - | - | 136236 |
| 3 | తూ॥ గోదావరి | 15000 | 15000 | 30000 | 27000 | 30000 | 64000 | 42000 | 52000 | 94000 |
| 4 | నెల్లూరు | 2500 | 40000 | 42500 | - | 5000 | 5000 | 5000 | 42500 | 47500 |
| 5 | ప్రకాశం | 625 | 16250 | 16875 | - | 3000 | 3000 | 625 | 19250 | 19875 |
| 6 | గుంటూరు | | | | | | | | | 12000 |
| 7 | శ్రీకాకుళం | | | 2223 | | | 1000 | | | 3223 |
| 8 | విశాఖపట్నం | | | | | | | | | 2000 |
| 9 | విజయనగరం | | | | | | | | | 400 |

**(పశ్చిమగోదావరి జిల్లా సమాచారం 2015 సెప్టెంబర్‌లో ఆర్.టి.ఐ ద్వారా పొందినది.**
**ఇప్పుడు జిల్లాలో 2 లక్షల ఎకరాలు ఆక్వా సాగులో ఉందని అంచనా)**

## ఆహార భద్రతకు ప్రమాదం

రాష్ట్రంలో 7 లక్షల ఎకరాలకు పైగా ఆక్వా సాగులో ఉంది. కోస్తాలోని 9 జిల్లాల సాధారణ సాగు విస్తీర్ణం 97 లక్షల ఎకరాలతో పోల్చితే ఇది 7.5%. కృష్ణా, ఉభయ గోదావరి (3) జిల్లాల సాగు విస్తీర్ణం 35 లక్షల ఎకరాలకు గానూ ఆక్వా సాగు 5.5 లక్షల ఎకరాల్లో ఉంది. ఇది 15.71%. రానున్న రోజుల్లో ఇంకా ఎక్కువగా పెరిగే అవకాశం వుంది. కృష్ణా జిల్లాలో 11 మండలాల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో 23 మండలాల్లో, తూర్పుగోదావరి జిల్లా లో 16 మండలాల్లో అధికంగా ఆక్వా సాగు జరుగుతోంది. భారత దేశపు ధాన్యాగారం (రైస్ బౌల్)గా పేరుగాంచిన కృష్ణా – గోదావరి డెల్టా ప్రాంతం ఆక్వా సాగుకు మళ్ళిపోతే ప్రజల ఆహార భద్రతకు తీవ్ర ముప్పు కలుగుతుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం గడిచిన మూడేళ్లలో కృష్ణా, ఉభయగోదావరి – మూడు జిల్లాల్లో వరి సాగు విస్తీర్ణం ఒక లక్షా 81 వేలు హెక్టార్లు (సుమారు నాలుగున్నర లక్షల ఎకరాలు) తగ్గింది. రాష్ట్రంలో వరి సాగు 2015–16లో 21లక్షల 60 వేల హెక్టార్లలో (53.36 లక్షల ఎకరాలు) కాగా ఈ మూడు జిల్లాల్లోనే 10 లక్షల 7 వేల హెక్టార్లు సాగవుతుంది. అంటే దాదాపు సగం అన్నమాట. అక్కడే విస్తీర్ణం ఇలా తగ్గి పోతుంటే ఇక ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా మిగులుతుందా?

| జిల్లా | వరిసాగు విస్తీర్ణం (వేల హెక్టార్లు) | | | తగ్గుదల |
|---|---|---|---|---|
| | 2013-2014 | 2014-15 | 2015-16 | |
| కృష్ణా | 363 | 288 | 221 | 142 |
| తూర్పు గోదావరి | 405 | 394 | 382 | 23 |
| పశ్చిమ గోదావరి | 420 | 409 | 404 | 16 |
| రాష్ట్రం | 1188 | 1091 | 1007 | 181 |

(రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ డ్యాష్ బోర్డు)

## కోస్టల్ ఆక్వా కల్చరల్ ఆథారిటి చట్టం, రూల్స్ చెప్పేదేమిటి?

సముద్ర తీరంలో చేపలు, రొయ్యల పెంపకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2005లో కోస్టల్ ఆక్వా కల్చరల్ అథారిటీ చట్టం చేసింది. దాని అమలుకు రూల్స్ రూపొందించింది. సముద్రం, నదులు, క్రీక్స్, అత్యధిక పోటు వచ్చే చోటు (హై టైడ్

లైన్)కు రెండు కిలోమీటర్ల పరిధి వరకు గల భూముల్లో ఆక్వా పెంపకం చేయాలంటే కోస్టల్ ఆక్వా కల్చరల్ ఆథారిటీ చట్టం, రూల్స్ (2005)ను పాటించాలి. 2015 ఫిబ్రవరి 16న సవరణ రూల్స్ ప్రకటించారు.

కోస్టల్ ఆక్వా కల్చర్ ఆథారిటీ (సి.ఎ.ఎ.) రూల్ -3 అనుసరించి మార్గదర్శక సూత్రాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. రొయ్యల చెరువు సైట్ సెలక్షన్ మొదలు రొయ్యలను పట్టేవరకు అన్ని దశల్లో పాటించవలసిన నిబంధనలు అందులో పేర్కొన్నారు. వాటిలోని కొన్ని అంశాలు.

- వ్యవసాయ భూములను రొయ్యల చెరువులుగా మార్చడాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిరుత్సాహపర్చాలి. వ్యవసాయానికి పనికిరాని తక్కువ రకం భూములను మాత్రమే రొయ్యల చెరువులకు అనుమతించాలి. (నిబంధన 4.3)
- సహజ మడ ప్రాంతాలు (మాన్‌గ్రోవ్), చిత్తడి భూములు (వెట్‌ల్యాండ్), తంపర (స్వాంప్) భూములను రొయ్యల చెరువులకు అనుమతించరాదు. (4.7)
- **500 లోపల జనాభాగల ఆవాసానికి (గ్రామం లేదా శివారు) 100 మీటర్ల దూరంలోను, 500 పైబడిన జనాభాగల ఆవాసానికి 300 మీటర్ల దూరంలో మాత్రమే అనుమతించాలి. పట్టణాలకు 2.కి.మీ. దూరం వుండాలి. మంచినీటి వనరు నుండి 100 మీటర్ల దూరంలోపల రొయ్యల చెరువులుండరాదు. (4.9)**
- **రెండు చిన్న రొయ్యల చెరువుల మధ్య  కనీస దూరం 20 మీటర్లుండాలి. పెద్ద చెరువులకు సైజునుబట్టి 100 నుండి 150 మీటర్ల దూరం వుండాలి. (4.9)**
- **సమీప వ్యవసాయ భూమికి లేదా పంటకాలువకు, మురుగు కాలువకు రొయ్యల చెరువు కనీసం 50 నుండి 100 మీటర్ల దూరం దాటి వుండాలి.**
- **మొత్తం రొయ్యల చెరువు భూమిలో 60% విస్తీర్ణం దాటి నీరు వుండరాదు. (4.9) మిగిలిన 40% భూమిని గట్లు, మొక్కల పెంపకం వంటి వాటికి వినియోగించాలి.**
- ఇప్పటికే రొయ్యల చెరువులున్న ప్రాంతాల్లో కొత్తవాటిని నివారించాలి (షుడ్ బి ఎవాయిడెడ్). (4.9)
- రొయ్యల పెంపకం కోసం భూగర్భజలాలను వినియోగించరాదు. భూమిలోపలి పొరల్లోకి ఉప్పదనం చొచ్చుకొని పోతుంది గనుక దాన్ని లెక్కగట్టడానికి ప్రతి హెక్టారుకు 4 చొ॥న పీజో మీటర్లు లేదా మోనిటరింగ్ బోర్‌వెల్స్ ఏర్పాటు చేయాలి. (19.2)

రెండు హెక్టార్లు (సుమారు ఐదు ఎకరాలు) విస్తీర్ణం లోపల గల చెరువులకు జిల్లా స్థాయిలోగల కమిటీ సిఫారసుతో దరఖాస్తులను చెన్నై లోని కోస్టల్ ఆక్వా కల్చరల్ ఆథారిటీ (సిఏఏ)కి పంపాలి. అంతకంటే ఎక్కువ విస్తీర్ణం గల చెరువులకు తొలుత రాష్ట్రస్థాయి కమిటీకి పంపితే అక్కడినుండి సిఏఏ కు పంపాలి. ఆ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఆయా చెరువులను సిఏఏ రిజిస్ట్రేషన్ చేస్తుంది. (ప్రతి ఐదేళ్ళకూ ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి) నవంబర్ 2016 వరకు రాష్ట్రంలో 17,571 మందికి చెందిన 22,034.64 హెక్టార్లు (54,447 ఎకరాలు) రిజిస్ట్రేషన్ చేయబడ్డాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన సోషియో ఎకనామిక్ సర్వే పేర్కొంది. కాని వాస్తవంగా ఇది ఇంకా ఎక్కువ ఉంది.

వెనామీ రకం, మాండన్ రకం రొయ్యల సాగులో పాటించవలసిన నిబంధనలు వివరంగా పేర్కొన్నారు. మాండన్ రకం రొయ్య పిల్లలు ఎకరానికి 80 వేలకు మించరాదు. వెనామీ రకం 2 లక్షల 40 వేల వరకు వేయవచ్చు. ఏరియేటర్ల వినియోగం, వ్యర్థాల శుద్ధి యంత్రాలకు (ఇటిసి) సంబంధించి నిబంధనలు పాటించాలి.

ఉప్పునీటి రొయ్యల సాగుకు సిఏఏ మార్గదర్శకాలను తప్పక పాటించాలి. **సిఏఏ రిజిస్ట్రేషన్ లేకుండా సాగుజేస్తే మూడు సంవత్సరాల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధించవచ్చు. కానీ ఇది ఎక్కడా అమలు కావడంలేదు.**

## రాష్ట్ర ప్రభుత్వ జివోలు

సిఏఏ పరిధిలో లేని – అంటే అత్యధిక సముద్రపోటు వచ్చే చోట నుండి రెండు కిలోమీటర్ల దూరం పైబడిన భూముల్లో మంచినీటి చేపలు, రొయ్యల పెంపకానికి రాష్ట్ర ఫిషరీస్ రూల్స్ మరియు జి.వోనెంలు 7,15 మున్నగు వాటిని పాటించాలి. జిల్లా స్థాయి కమిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ రూల్స్, జి.వో.లు ఉన్నాయి. (సిఎఎ నిబంధనలతో పోల్చితే రాష్ట్ర ప్రభుత్వ జి.వోలలో ఎక్కువగా నిబంధనలను నీరుగార్చారు. ఉదాహరణకు మొత్తం చెరువు భూమిలో 60% మాత్రమే నీరుండాలని కేంద్రం రూల్స్‌లో పేర్కొంటే రాష్ట్ర జి.వోలో దాన్ని 80% చేశారు. ఇలా ఎన్నో...)

అక్టోబర్ 2016 వరకు రాష్ట్రంలో 34,044 మందికి చెందిన 95,703.01 హెక్టార్లు (2,36,482 ఎకరాలు) రిజిస్ట్రేషన్ అయినట్లు సోషియో ఎకనామిక్ సర్వే (2016–17)పేర్కొంది. వాస్తవంగా ఉన్న చేపలు, రొయ్యల చెరువుల విస్తీర్ణం ఇంతకు

రెట్టింపు కన్నా ఎక్కువే ఉంది. 2016 డిసెంబర్‌లో జరిగిన కలెక్టర్ల సమావేశానికి ఇచ్చిన నోట్ ప్రకారం రాష్ట్రంలో 72,613 హెక్టార్లు (1,79,426 ఎకరాలు) చేపలు, రొయ్యల చెరువులను డిఎల్‌సిలు రిజిస్టర్ చేయవలసి ఉందని పేర్కొన్నారు. కాబట్టి రిజిస్ట్రేషన్ జరిగిన దానికి అదనంగా ఇంకా అంత సాగు ఉందని రూఢి అయినట్టే. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2016 నాటికి రిజిస్టర్ అయినవి, కానివి కలిపి చేపలు, రొయ్యల చెరువులు 1,68,316హెక్టార్లు (4,15,908ఎకరాలు) ఉన్నాయి. వాస్తవంగా ఇప్పుడు రాష్ట్రంలో 7 లక్షల ఎకరాలకుపైగా ఆక్వాసాగు జరుగుతోందని పత్రికలు, కొన్ని సంస్థల అంచనా.

మంచినీటి చెరువుల్లో చేపల పెంపకానికి జిల్లా స్థాయి కమిటీ (డిఎల్‌సి) నుండి అనుమతి పొందాలి. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మత్స్య, వ్యవసాయ, ఇరిగేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మున్నగు అధికారులతో కూడిన కమిటీ ఇది. జి.వో.నెంబర్-7, తేది 16.03.2013 ప్రకారం నిబంధనలను పాటించాలి. దరఖాస్తును "మీసేవా" కేంద్రం ద్వారా సమర్పించే అవకాశం కల్పించారు.

మంచినీటి రొయ్యల పెంపకానికి జి.వో. 15, తేది. 29.04.2013 ప్రకారం డిఎల్‌సి నుండి అనుమతి పొందాలి. ఆ నీటిలో 0.5 పిపిటి కంటే ఎక్కువ ఉప్పదనం (సెలినిటీ) ఉన్నచోట మాత్రమే పెంచాలి. అంతకు ముందు (జి.వోనెం.7 ప్రకారం) మంచినీటి చేపల చెరువుల కొరకు అనుమతి పొంది వుండాలి. సిఏఏ పరిధిలో లేని భూములలో చెరువులను మాత్రమే రొయ్యల పెంపకానికి డిఎల్‌సి పరిగణిస్తుంది. దరఖాస్తు చేసిన 60 రోజుల లోగా చెరువును పరిశీలించి రొయ్యల పెంపకానికి అనువైన వాటికి అనుమతిని మంజూరు చేస్తుంది.

**రొయ్యల చెరువుల నుండి వదిలిన మురుగునీటిని ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో శుద్ధిచేసిన తరువాతనే బయటకు వదలాలి (జి.వో 15 - నిబంధన 3.8). బయటకు విడిచే నీటి నాణ్యత (పిహెచ్ విలువ, రసాయన అవశేషాలు, నీటిలో ఆక్సిజన్, ఇతర వాయువుల స్థితి మొ॥) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు ప్రమాణాల మేరకు ఉండాలి.**

- జి.వో. నెంబర్ 7, తేది 16.03.2013లో నిబంధన 7.2 ప్రకారం సారవంతమైన వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చరాదు.
- ఉప్పు పండే భూములు, మ్యాన్‌గ్రోవ్స్, చిత్తడి భూములు, అటవీ భూములు, సరుగుడు తోటలు, పచ్చికమేత కోసం ఉన్న భూములు, గ్రామ ఉమ్మడి అవసరాలకు

కేటాయించబడిన భూములను చెరువులుగా మార్చడానికి వీల్లేదు. (7.3)

- చేపల చెరువులు సహజమైన డ్రెయిన్‌లను, కాలువలను ఆటంక పర్చరాదు. అలాగే మిగిలిన ప్రాంతాల్లో వరద సంభవించే పరిస్థితికి కారణం కాకూడదు. (7.5)
- గ్రామానికి కనీసం 10 మీటర్ల దూరంలో ఉండాలి. (7.8)
- మంచినీటి వనరులకు కనీసం 10 మీటర్ల దూరంలో వుండాలి. (7.9)
- స్మశానాలు, ప్రార్థనా స్థలాలకు కనీసం 10 మీటర్ల దూరంలో వుండాలి. (7.10)
- **చేపలు, రొయ్యల చెరువు త్రవ్వేందుకు ఆ చుట్టు ప్రక్కలగల రైతుల అభ్యంతరాలను 15 రోజుల్లోగా తెలియజేయాలని కోరుతూ సంబంధిత గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించాలి. అభ్యంతరాలు వచ్చినట్లైతే వాటిని పరిష్కరించాకే జిల్లా స్థాయి కమిటీ అనుమతివ్వాలి. (సవరణ 7)**

ఇప్పటికే వున్న మంచినీటి చెరువులను రెగ్యులరైజ్ చేయడానికి, కొత్తవాటికి సంబంధించి జి.వో.7, 15లలోని కొన్ని అంశాలను సవరిస్తూ జి.వో.48 ని 20.09.2016న ప్రభుత్వం జారీ చేసింది. చెరువులను రెగ్యులరైజ్ చేసుకోవడానికి 31.12.2016లోగా దరఖాస్తు చేసుకోవాలి. (సవరణ -4) 31.03.2017 వరకు నెలకు ఎకరానికి రూ.300లు పెనాల్టీ విధిస్తారు. ఆ తేదీనాటికి కూడా దరఖాస్తు చేయకపోతే ఎకరానికి రూ.5,000లు పెనాల్టీ విధించడంతో పాటు వెంటనే ఆ చెరువును మూసివేయడానికి జిల్లా కలెక్టర్‌కు అధికారం వుటుంది. (సవరణ-7)

## ఉల్లంఘనలు

సుక్షేత్రాలను చేపలు, రొయ్యల చెరువులుగా మార్చడం అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చట్టాలను, జివోలను ఉల్లంఘించడమే. అయితే ఆ జివోలలోనే ఉన్న కొన్ని లొసుగులను రొయ్యలు, చేపల చెరువుల యజమానులు వక్రీకరించి తమకనుకూలంగా మలుచుకోడానికి ప్రభుత్వమే అవకాశం కల్గించింది. తక్కువ ఉత్పాదకత గల, నీటి ముంపునకు గురయ్యేవి, లోతట్టు భూములు, పడావు పడిన (ఫ్యాలో) భూములను చెరువులుగా మార్చవచ్చని నిబంధనలో పేర్కొన్నారు. దీంతో ఏ భూముల్లో అయితే చేపలు, రొయ్యల చెరువులు తవ్వాలనుకుంటున్నారో వాటిని లోతట్టు భూములుగా లేదా తక్కువ ఉత్పాదకత కలిగినవనో ఏదో ఒక పేరుతో తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారు.

కొన్నిచోట్ల పంటకాలువలను మురుగు కాలువలుగా పేర్కొన్నారు. చేపల చెరువుల పేరిట అనుమతి పొంది, వాటిలో రొయ్యల సాగు చేస్తున్నారు.

చెరువుల త్రవ్వకంపై గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో పెట్టి, ప్రజల అభ్యంతరాలు తెలుసుకోవాలని జివోలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ చేపలు/రొయ్యల చెరువులు తవ్వుతున్నారన్న సంగతి ప్రొక్లెయిన్‌లు వస్తే తప్ప గ్రామస్థులకు తెలియడం లేదు. గ్రామ పంచాయతీ, రెవెన్యూ కార్యాలయాల్లోను, ఇతర సామూహిక ప్రదేశాల్లో ప్రదర్శించాలన్న నిబంధన అమలు కావడం లేదు. గ్రామాలకు, ఆవాసాలకు అదే విధంగా ప్రార్థనా స్థలాలు, స్మశానాలకు 10 మీటర్ల దూరంలో మాత్రమే చెరువుల అనుమతించాలన్న నిబంధన ఉంది. నిర్ణయించబడిన ఆ 10మీటర్ల దూరమే తక్కువ. అదికూడా అమలు కావడంలేదు.

హైటైడ్ లైన్ నుండి రెండు కిలోమీటర్ల పరిధి వరకు చేపలు, రొయ్యలు పెంచాలంటే తప్పనిసరిగా సిఎఎ అనుమతి తీసుకోవాలి. కానీ అలాంటి భూముల్లో సైతం జిల్లా స్థాయి కమిటీల అనుమతులతో రొయ్యల చెరువులు తవ్వేస్తున్నారు. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ ఇచ్చిన అనుమతులు ప్రతి ఐదు సంవత్సరాలకు తిరిగి రెన్యువల్ చేస్తుండాలి. కానీ అత్యధికులు అలా చేయడం లేదు.

రొయ్యల చెరువుల్లో విపరీతంగా రసాయన పదార్థాలు వాడుతారు. అంతేగాక చెరువుల్లో ఉప్పు బస్తాలు వేసి కృత్రిమంగా ఉప్పదనం పెంచుతారు. రసాయనాలు, ఉప్పు భూమిలోపలి పొరల్లోకి చొచ్చుకొనిపోవడం (ఇంకడం) వల్ల చుట్టుప్రక్కల గల భూములు చౌడుబారిపోవడం, ఇతర కాలుష్యాలకు గురికావడం జరుగుతుంది. దీనిని నివారించడానికి రొయ్యల చెరువుల్లో మందమైన పాలీఎథిలిన్ షీట్ పరవాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు.

చేపలు, రొయ్యల చెరువుల త్రవ్వకం, నిర్వహణ, మురుగు నీటిని వదలడం వంటి అన్ని అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చట్టాలు, జి.వోలు, నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘించబడుతున్నాయి. చేపలు, రొయ్యల చెరువు వద్ద డిఎల్‌సి మంజూరు చేసిన అనుమతి పత్రాన్ని అందరికీ కనిపించే విధంగా పెద్ద బోర్డుపై ప్రకటించాలని నిబంధన వుంది. కానీ రాష్ట్రంలో ఎక్కడా అలాంటి బోర్డులు పెట్టడంలేదు. అలాగే ప్రతి రొయ్యల చెరువు మురుగునీటిని ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో శుద్ధిచేసి మాత్రమే విడిచిపెట్టాలి. ఎక్కడా అవి ఏర్పాటు చేయలేదు.

భూమి గణనీయంగా చేపలు, రొయ్యల చెరువులుగా మారిన ప్రాంతాలను ఆక్వాజోన్స్ పేరిట ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో చేపలు, రొయ్యల చెరువుల త్రవ్వకానికి ఇష్టారీతిన ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 50% ఆక్వా సాగు ఉన్న ప్రాంతాన్ని ఆక్వాజోన్‌గా ప్రకటించి ఆ గ్రామాల్లో చెరువుల అనుమతిని సులభతరం చేయనున్నారు. ఆక్వా చెరువుల ప్రాంతంలో ఇంటర్నల్ రోడ్లను ఉపాధిహామీ నిధులతో ఏర్పాటు చేస్తామని, విద్యుత్‌లైన్లు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వ ఖర్చుతోనే ఏర్పాటు చేస్తుందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలోని 23 మండలాలను గుర్తించి వాటిని 4 ఆక్వా జోన్లుగా ప్రకటించారు.

## కాలుష్యం - ఆర్థిక, సామాజిక ప్రభావాలు

విచక్షణారహితంగా చేపలు, రొయ్యల చెరువులు త్రవ్వడం వల్ల చాలా గ్రామాల్లో మంచినీటి చెరువులు కలుషితమయ్యాయి. డ్రెయిన్‌లు పూడ్చి వేయబడటం, పంటకాలువల్లోకి చెరువుల కలుషిత నీరు వదిలేయడంతో ఊరి మంచినీటి చెరువులన్నీ కలుషితం అయిపోయాయి. విస్తారమైన ప్రాంతంలో - దగ్గర దగ్గరగా ఆక్వా సాగు సాగడంతో చెరువులు విషతుల్యంగా మారాయి. దీనివలన త్రాగునీటి సమస్య తీవ్రమైంది. ప్రజలు పాలపాకెట్లు కొనుక్కున్నట్లు నీటి క్యాన్‌లు కొనుక్కోవలసి వస్తోంది. ఎంత పేదవాడైనా త్రాగునీరు కొనుక్కొని త్రాగాల్సిందే. 20 లీటర్ల క్యాన్ ఇంటికి తెచ్చి ఇస్తే రూ.20, ప్లాంటు వద్దకు వెళ్ళి తెచ్చుకుంటే రూ.15లు చెల్లించాలి. ఐదుగురు సభ్యుల కుటుంబానికి నెలకు 40 నుండి 50 క్యాన్లు అవసరమౌతాయి. అంటే నెలకు ప్రతి కుటుంబం కనీసం రూ.600లు నుండి రూ.1000 వరకు త్రాగునీటికే ఖర్చు చేయవలసి వస్తోంది. చేపలు, రొయ్యల చెరువులు ఎక్కువగా విస్తరించిన కృష్ణా జిల్లా నందివాడ మండలంలో ఏడాదికి ఆరు కోట్ల రూపాయల మంచినీటి వ్యాపారం జరుగుతోందని అంచనా. ఈ లెక్కన రాష్ట్రంలో ఆక్వా సాగు ముఖ్యంగా రొయ్యల చెరువులు ఎక్కువగా ఉన్న సుమారు 60 మండలాల్లో ఏడాదికి 350-400 కోట్ల రూపాయల మంచినీటి వ్యాపారం సాగుతోందని బోధపడుతుంది.

అంతేకాదు స్నానాలు ఇతర అవసరాలకోసం వాడే నీరు కూడా కలుషితం అవడం వలన చర్మవ్యాధులు, జీర్ణకోశ వ్యాధులు విస్తారంగా నమోదవుతున్నాయి. ఊరి మంచినీటి చెరువులు కలుషితం అవడం వలన పశువులపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఈ నీరు త్రాగడం వలన పశువులు ఈసుకుబోతున్నాయి. పాలు ఇవ్వడం తగ్గిపోయింది. పశు సంపద తగ్గిపోయింది.

## అస్సైన్డ్ భూములు అన్యాక్రాంతం

రొయ్యలు, చేపల చెరువుల్లో పంట కాలువలను, డ్రెయిన్లనూ, గట్లను, ఊరుమ్మడి భూములను కలిపేస్తున్నారు. అంతేగాక ఎస్సీ, ఎస్టీ, బిసిలకున్న అసైన్డ్ భూములను కలిపేస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయి. కలుపుకున్న భూముల్లో చాలా చోట్ల కౌలు చెల్లించడం లేదు. అస్సైన్డ్ భూములను అన్యాక్రాంతం చేయరాదని, కొనరాదన్న నిబంధనలను తుంగలోతొక్కి నందివాడ మండలం ఇలపర్రు గ్రామంలో దళితులకు చెందిన 165 ఎకరాలు సొసైటీ భూమిని చేపలు/ రొయ్యల చెరువుల్లో కలిపేశారు. తమ భూములను అప్పగించాలని దళితులు సుదీర్ఘ కాలంగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం రొయ్యల చెరువుల యజమానుల కొమ్ము కాస్తూ దళితులను గాలికొదిలేస్తుంది. రాష్ట్రంలో 30,122 హెక్టార్లు (74,431 ఎకరాలు) డి పట్టా భూముల్లో వున్న రొయ్యలు, చేపల చెరువులను రిజిస్ట్రేషన్ చేయాలని డిసెంబర్‌లో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలోనే చెప్పారంటే ఎసైన్డ్ భూములు ఎంతలా అన్యాక్రాంతం అయ్యాయో విదితమవుతుంది. చెరువు త్రవ్వడానికి 10 ఎకరాలకు పర్మిషన్ పొంది ఎస్సైన్డ్, ప్రభుత్వ భూములు, డ్రెయిన్‌లు మొ॥ కబ్జా చేసి 15-20 ఎకరాలు చెరువులు త్రవ్వేస్తున్నారు.

## కొబ్బరి సాగుకు ముప్పు

కొబ్బరి సాగులో కేరళ, తమిళనాడు, కర్నాటక తర్వాత మన రాష్ట్రం నాలుగవ స్థానంలో వుంది. అయితే దిగుబడిలో మాత్రం మిగిలిన మూడింటికంటే అగ్రస్థానంలో వుంది. రాష్ట్ర కొబ్బరి సాగులో సుమారు నాలుగింట మూడు వంతులు ఉభయ గోదావరి జిల్లాల్లోనే వుంది. ఆక్వా సాగుతో కొబ్బరి దిగుబడి తగ్గుతోంది. కేంద్ర ప్రభుత్వ కొబ్బరి అభివృద్ధి బోర్డు గణాంకాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లాలో 2012-13 సం॥లో హెక్టారుకు 19,869 కాయలు దిగుబడిరాగా 2015-16 సం॥లో 13,576 కాయలకు పడిపోయింది. ఇదే కాలంలో కృష్ణా జిల్లాలో దిగుబడి హెక్టారుకు 16,744 కాయల నుండి 14,671కి పడిపోయింది. అటు కోనసీమలోనూ, ఇటు పాలకొల్లు - భీమవరం ప్రాంతంలో పెరిగిన రొయ్యల సాగు మూలంగా కొబ్బరి దిగుబడి తగ్గుతోంది. దిగుబడి తగ్గడమేగాక కాయ సైజు (పరిమాణం) కూడా తగ్గిపోతున్నదని అంబాజీపేటలోని కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు గుర్తించారు. రొయ్యల చెరువు గట్లమీద, సమీపంలోనూ వున్న కొబ్బరి చెట్ల వేళ్ళు నిరంతరం చెరువు నీటిలో నానడం వల్ల తెగుళ్లు బారిన పడుతున్నాయనీ, అవి ఇతర తోటలకూ సోకుతున్నాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. వారి అంచనా ప్రకారం రానున్న సంవత్సరాల్లో ఈ ప్రమాదం మరింతగా పెరుగుతుంది.

## కాలుష్య కోరల్లో కొల్లేరు

కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు ఆసియాలోనే అతి పెద్ద మంచినీటి సరస్సు. 90,100హెక్టార్ల (2,22,637 ఎకరాల) విస్తీర్ణంలో ఉండేది. ఆక్రమణలతో క్రమంగా కుదించుకుపోతోంది. మొత్తం 50 బెడ్ గ్రామాలు, 98 బెల్ట్ గ్రామాలు ఉన్నాయి. సైబీరియా నుండి ఏటా పెలికాన్ పక్షులు ఇక్కడకు వచ్చి వెళుతుంటాయి. పర్యావరణ రీత్యా కీలకమైన చిత్తడి నేల (వెట్‌ల్యాండ్) ఇది. స్థానిక ప్రజలు సాంప్రదాయ సిద్ధంగా చేపలు పట్టి జీవనోపాధి వెళ్లబుచ్చుకునేవారు. ప్రభుత్వం 1970వ దశకంలో సొసైటీలను ఏర్పాటు చేసి స్థానిక పేదల చేపల పెంపకాన్ని ప్రోత్సహించింది. చీమలు పెట్టిన పుట్టలు పాములకు నెలవైన చందంగా ఆక్వా మాఫియా కొల్లేటి లంకలను ఆక్రమించి విస్తారంగా చేపలు, రొయ్యల సాగుకు మళ్లించారు. మరోవైపు పారిశ్రామిక కాలుష్య జలాలతో కొల్లేరు విషతుల్యమైపోయింది. ప్రఖ్యాతి గాంచిన కొల్లేరు సరస్సు ఆక్వా మాఫియా బారిన పడి ధ్వంసమవుతోంది.

## కౌలు రైతులు

నీటి పారుదల సౌకర్యంగల జిల్లాల్లో కౌలు సాగు గత 20 ఏళ్ళల్లో పెరుగుతూ వచ్చింది. కృష్ణా - గోదావరి డెల్టాలో దాదాపు 70% భూమి కౌలుదార్ల సాగులో ఉందని అంచనా. అయితే సాధారణ సాగుకంటే (వరి వగైరా) ఆక్వా సాగుతో అధిక ఆదాయాలు పొందవచ్చునని యజమానులు ఆ భూములను ఆక్వాకు మళ్లిస్తున్నారు. దీంతో పందల ఎకరాలు సాగుచేసే పెట్టుబడిదార్ల చేతుల్లోకి చిన్న, సన్నకారు రైతుల భూములు మళ్ళించబడుతున్నాయి. పర్యవసానంగా వరి, మినుము వంటి పంటలు పండించే కౌలుదార్లు భూమినుండి వెళ్లగొట్టబడుతున్నారు. వారందరూ ఉపాధి కోల్పోతున్నారు. కౌలుదారుగా ఉన్నప్పుడు పొందిన ఉపాధిని ఆక్వా విస్తరణ మింగేస్తుంది. ఇది వారిలో తీవ్ర అలజడికి కారణమైంది.

## పాడికి పాడె కడుతున్నారు...

"ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చిందన్న" చందంగా ఆక్వా సాగు పెరుగుతున్న కొద్దీ గ్రామాల్లో పాడిపశువులు తగ్గిపోతున్నాయి. సాధారణ వ్యవసాయం (వరి, మినుము, .... ) సాగయ్యేటప్పుడు పచ్చగడ్డి, ఇతర గ్రాసం పశువులకు సమృద్ధిగా లభించేవి. పాలు అమ్ముకోవడం ద్వారా కుటుంబానికి అవసరమయ్యే రోజువారీ ఖర్చులకు

సరిపోయేవి. ప్రధానంగా కుటుంబ నిర్వహణలో స్త్రీలకు ఎంతో ఆసరాగా ఉండేది. కానీ ఆక్వా సాగుతో పశు పెంపకానికి అవకాశాలు అడుగంటిపోయాయి. ఆక్వా సాగువల్ల కాలుషిత నీరు తాగి పశువులకు రోగాలు వస్తున్నాయి. కట్టునిలవడంలేదు. ఈ కారణం కూడా తోడయి పశుగణం తగ్గిపోతోంది.

భారత ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన (లైవ్‌స్టాక్ సెన్సస్) చేపడుతుంది. దాని ప్రకారం కృష్ణా జిల్లా కలిదిండి మండలంలో 2007లో ఆవులు (ఆంబోతులు, దూడలతో సహా) 2,134 ఉండగా 2012 నాటికి 1,230కి పడిపోయాయి. అదే గేదెలు (దున్నలు, దూడలతో సహా) 16,073 ఉండగా 2012 నాటికి 11,257కి పడిపోయాయి. అంటే ఏడాదికి సుమారు వెయ్యి చొప్పున (దాదాపు 7-8 శాతం) తగ్గాయి. పరిస్థితి మరింతగా దిగజారిందని, ఇప్పుడు ఆక్వా సాగు పెరుగుతున్న మండలాల్లో పశుసంపద ఏటా 8-10 శాతం చొప్పున తగ్గుతోందని పశుసంవర్ధకశాఖ అధికారుల అంచనా. 2017జూన్, జూలైలో పశుగణన జరగాల్సి వుంది.

### ఆక్వా పెరుగుదల - జనాభా తరుగుదల

రెండంకెల వృద్ధి, తలసరి ఆదాయం పెరుగుదల వంటి మాటలతో ముఖ్యమంత్రి ఊదరగొడుతున్నా వాస్తవాలు మాత్రం దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మండల స్థూల ఉత్పత్తి (2014-15) వివరాలు పరిశీలిస్తే ముందు స్థానంలో వున్న పాడిని ఆక్వా ఆక్రమించింది. కూలీలు, కౌలు రైతులు ఉపాధి పోయి ఆయా మండలాల్లో జనాభా తగ్గుతోంది.

కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలో మత్స్య రంగ స్థూల ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్న మండలాలు పశు సంపద, పాడి ఉత్పత్తిలో, అదే విధంగా తలసరి ఆదాయంలో ఏయే స్థానాల్లో ఉన్నదీ క్రింది పట్టికలో చూడవచ్చు (కృష్ణా జిల్లాలో 50 మండలాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 46 మండలాలు ఉన్నాయి). పశు సంపద, పాడి బాగుంటే ఎక్కువ మందికి ఉపాధి, కుటుంబానికి ఆదాయం లభిస్తుంది. కాని ఆక్వా పెరిగిన మండలాలు పాడిలో అట్టడుగున ఉన్నాయి. జిల్లా మొత్తంలో జనాభా పెరిగినప్పటికీ ఆక్వా రంగం అధికంగా ఉన్న మండలాల్లో 2001 నుండి 2011కు జనాభా తరుగుదల స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరుగుదల వేగం 2021 జనాభా లెక్కల నాటికి మరింత తీవ్రమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

**మండల స్థూల ఉత్పత్తి (2014-15) కొన్ని వివరాలు**

| | మత్స్య ర్యాంకు | పాడి ర్యాంకు | తలసరి ఆదాయం ర్యాంకు | జనాభా తగ్గుదల/ పెరుగుదల% |
|---|---|---|---|---|
| కృష్ణా : కలిదిండి | 1 | 43 | 2 | -3.11 |
| నందివాడ | 2 | 50 | 1 | -9.92 |
| కైకలూరు | 3 | 41 | 7 | 3.37 |
| **జిల్లా మొత్తం** | | | | **7.87** |
| | | | | |
| ప॥గోదావరి : | | | | |
| భీమవరం | 1 | 26 | 13 | 3.1 |
| కాళ్ల | 2 | 27 | 1 | -1.09 |
| ఏలూరు | 3 | 44 | 14 | -2.18 |
| **జిల్లా మొత్తం** | | | | **3.51** |

వ్యవసాయ భూమి చెరువులమయం అయిపోవడంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి తగ్గిపోయింది. గతంలో కాలువలు, ఊరి చెరువుల గట్లుకట్టడం, పూడికలు తీయడం వంటి అనేక ఉపాధి పనులు ఇప్పుడు లేకుండా పోయాయి. గతంలో ఒక ఎకరానికి సీజన్‌కు 55 పని దినాలు చొప్పున 100 ఎకరాలైతే 5500 పని దినాలు వచ్చేవి. రెండు పంటలయితే 11వేల పనిదినాలు ఇప్పుడు 100 ఎకరాల మీద ముగ్గురు లేదా నలుగురు కాపలాదార్లతో పని నడిచిపోతున్నది. 1400 పని దినాలేనన్నమాట. చేపలు, రొయ్యలు పట్టడం, ఇతర పనులను లెక్క వేస్తే మరోవెయ్యి పని దినాలు వస్తాయి. మొత్తం 2400 అయినాగాని పని లభ్యత అయిదో వంతుకు పడిపోయిందన్న మాట. పని దొరకనందున అనివార్యంగా పేదలు వలస పోవలసి వస్తోంది. అందరికంటే ముందు దళితులు గ్రామాలు వదిలిపోవాల్సి వస్తోంది.

నందివాడ మండలం తమిరిశ పంచాయితీలో గంటావారిపాలెం, అంకన్నగూడెం అనే శివారు గ్రామాలుండేవి. ఆ గ్రామాల పొలాలన్నీ రొయ్యలు, చేపల చెరువులుగా

మారిపోవడంతో ఉపాధి లేక గ్రామస్తులు ఊరు వదిలి వలస పోయారు. ఇప్పుడు అక్కడ కేవలం నాలుగు కుటుంబాలు మాత్రమే మిగిలాయి. పిల్లలు లేకపోవడంతో ప్రాథమిక పాఠశాల పూర్తిగా మూతపడింది. ఆక్వా సాగు పెరిగిన మండలాలలో పేద కుటుంబాలు వలసలు పోవడం వల్ల ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అంతకంతకు తగ్గిపోతోంది.

అయితే కృష్ణా, పశ్చిమగోదావరి, నెల్లూరు వంటి జిల్లాల్లో 25-30 సంవత్సరాలుగా రొయ్యల/ చేపల చెరువులున్న ప్రాంతాల్లో ప్రజల సామాజిక ఆర్థిక జీవనంలోనూ అవి భాగం అయ్యాయి. ఫీడ్ వ్యాపారం, రవాణా, ఇతర ఇన్‌పుట్స్ మొదలగు వాటిపై ఆధారపడడం పెరిగింది. ప్రభుత్వం అభివృద్ధి, అధిక ఆదాయం పేరిట ప్రోత్సహిస్తోంది. గ్రామాల్లోని భూస్వాములు, పెట్టుబడిదారీ భూస్వాములూ ఆక్వా రంగంలో ఆర్థికంగా బలం పుంజుకున్నారు. పేద రైతుల భూములు ధనికుల చేతిలోకి (చెరువులకు లీజుకివ్వడం లేదా అమ్ముకోవడం) పోయి భూకేంద్రీకరణ పెరిగింది. గ్రామాల్లోని అగ్రవర్ణాలకు చెందిన భూస్వాముల కుటుంబాలు సమీప పట్టణాలకు మకాం మార్చాయి. ఆర్థిక రాజకీయ లావాదేవీలు, ఆక్వా కార్యకలాపాలను యజమానులు గ్రామాల్లో పట్టణాలనుండి నిర్వహిస్తున్నారు. గ్రామ స్వభావం (స్ట్రక్చర్) పూర్తిగా మారిపోతోంది. ఆక్వా వల్ల జనం ఊరు వదిలి పోనైనా పోవాలి లేదా తిరగబడనైనాబడాలి. కొన్నిచోట్ల ప్రస్తుతం తిరగబడుతున్నారు.

సాధారణ వ్యవసాయంతో పోల్చితే ఆక్వా సాగుతో ఆదాయం కొంత ఎక్కువగా వస్తున్నది. ఆ మేరకు రైతుకు భూముల లీజుద్వారా ఎక్కువ ఆదాయం వస్తుంది. దీంతో కొందరు భూయజమానులు అటువైపు మొగ్గుతున్నారు. చుట్టూ వున్న భూమి చెరువులక్రింద మారిపోవడంతో మధ్యలో అక్కడక్కడా వున్న చిన్న కమతాల్లో వరి పండించలేక చిన్న, సన్నకారు రైతుల కూడా ఆ భూమిని అమ్ముకోవడం లేదా లీజుక్వివలసిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడుతోంది. సాధారణ (వరి, మినుము....) సేద్యానికి భూమి అంతకంతకూ తగ్గిపోతున్నది. వ్యవసాయ కార్మికులు, కౌలుదార్లుగా వున్నవారు వ్యవసాయ పనులకోసం 40-50 కి.మీ. సైతం వెళ్లి (ఆటోల్లో/ ట్రాక్టర్లు) జీవనం సాగిస్తున్నారు. కొందరు శాశ్వితంగా వలసలు పోతున్నారు.

చట్ట విరుద్ధంగా రొయ్యలు, చేపల చెరువులకు మళ్ళిన భూములను తిరిగి వ్యవసాయ యోగ్యంగా చేయడానికి మట్టి తోలడంతో సహా పెద్ద ప్రయత్నం జరగాలి.

## ఆక్వా ప్రోసెసింగ్ ప్లాంట్లు - కార్మికుల పరిస్థితి

ఆక్వా ఉత్పత్తుల ప్రోసెసింగ్ ప్లాంట్ల కాలుష్య వల్ల పరిసర గ్రామాల ప్రజలు, భద్రతా చర్యలు లేని మూలంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామంలో ఆనంద గ్రూప్ ఆక్వా ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మరణించారు. తూర్పు గోదావరి జిల్లా నెక్కంటి సీ ఫుడ్స్‌లో అమోనియా గ్యాస్ లీక్‌వల్ల 70 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మే 6న తూర్పు గోదావరి జిల్లా కరప మండలం గురజనాపల్లిలో వీరభద్ర రొయ్యల ప్రోసెసింగ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో సుమారు 30 మంది అస్వస్థులైనారు. ఇలా ప్రమాదాలు ప్రతి నెలా జరుగుతూనే వున్నాయి.

ఆక్వా ప్రోసెసింగ్ ప్లాంట్లు సముద్రతీరం పొడవునా ఉన్నాయి. రొయ్యల తల, తోక, ఇతర వ్యర్థాలు తొలగించే ప్రోసెసింగ్ ప్లాంట్లు కొన్ని కాగా ఇంకొన్ని కేవలం వాటిని ఉప్పునీరు, రసాయనాలతో శుద్ధిచేసి ఐస్‌లో పెట్టి రవాణా చేసే ప్లాంట్లుగా ఉన్నాయి. చాలా చోట్ల స్థానికులను కాకుండా ఇతర రాష్ట్రాలనుండి కార్మికులను తీసుకొచ్చి పనిలో పెట్టుకుంటున్నారు.

రొయ్యలు, చేపల ప్రాసెసింగ్ పరిశ్రమల్లో అత్యధికంగా పని చేసే మహిళా కార్మికులు రోజులో 12 గంటలకు పైగా పని చేయవలసి వస్తోంది. అది కూడా సుమారు 8 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద అమ్మోనియా, క్లోరిన్ వంటి ప్రమాదకర వాయువుల మధ్య పని చేస్తారు. వారి రక్షణకు మాస్కులు, గ్లౌస్‌లు (చేతి తొడుగులు), గమ్‌బూట్లు కూడా యాజమాన్యాలు సరఫరా చేయడం లేదు. ప్రమాదకర వాయువుల సాంద్రతను ఎప్పటికప్పుడు నియంత్రించే వ్యవస్థలు సరిగా పని చేయడం లేదు. ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య పని చేస్తున్న వారికి కనీస వేతనాలు కూడా దక్కడం లేదు. ఆదివారం సెలవులు లేవు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు లేకపోవడమేగాక ఉద్యోగ భద్రత లేదు. ప్రాసెసింగ్ ప్లాంట్లలో పని చేసే కార్మికులు చర్మ వ్యాధులు, ఎగ్జిమా, ఊపిరితిత్తుల వ్యాధులతోపాటు మజిల్‌క్రాంప్ (కండరాలు పట్టేయడం)లతో బాధ పడుతున్నారు. ఎక్కువమంది నడుమునొప్పి, ఆర్థరైటిస్ బాధితులుగా మారుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రులో మెగా ఆక్వా ఫుడ్‌పార్క్ నిర్మాణం వల్ల తీవ్ర హాని జరుగుతుందని ఆయా గ్రామస్తులు సుమారు రెండేళ్ళుగా ఆందోళన, పోరాటం సాగిస్తున్నారు. ఆ జిల్లాలో ఆక్వా ప్రోసెసింగ్ ప్లాంట్లు, చెరువుల మూలంగా కలిగే కాలుష్యం ఈ ఆందోళనకు కారణం. ప్రమాదాల పట్ల ప్రజల్లో ప్రచారం జరగడానికి ఆ

ఉద్యమం ఎంతగానో తోడ్పడింది. ఇప్పటికే పరిశ్రమలు, పట్టణాల కాలుష్యం మూలంగా యనమదుర్రు డ్రెయిన్ నీరు కలుషితమైంది. తుందుర్రు ఆక్వా పార్కు నిర్మిస్తే గొంతేరు డ్రెయిన్ కూడా కలుషితంగా మారుతుందన్న భయం ప్రజలకు కలిగింది. ఆ డ్రెయిన్‌పై ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులు, కౌలుదార్లు, చేపలు పట్టి జీవిస్తున్న మత్స్యకారులు, ఇంటి అవసరాలకు నీటిని ఉపయోగించుకునే పరీవాహక గ్రామాల ప్రజలు ఈ ఆందోళనలో తరతమ స్థాయిల్లో పాల్గొంటున్నారు. షుమారు 40 గ్రామాలు - 40 వేల ఎకరాలకు పైగా భూములు కాలుష్యానికి గురవుతున్నాయని రైతులు ఆందోళన.

## పొల్యూటర్స్ పే

పర్యావరణానికి హాని కలిగించేవారే జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలన్నది ప్రపంచవ్యాపితంగా వున్న సూత్రం. దాన్ని "పొల్యూటర్ పేస్ ప్రిన్సిపుల్" (పిపిపి) అంటారు. రియోలో 1992లో జరిగిన అంతర్జాతీయ సదస్సు డిక్లరేషన్‌లో అది 16వ అంశంగా వుంది. ఆ సదస్సులో భాగస్వామి అయిన భారత ప్రభుత్వం ఆ సూత్రాన్ని ఆమోదించింది.

"ప్రజల పౌష్టికాహారస్థాయి, జీవన ప్రమాణాలను పెంచడంతోపాటు ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల పౌష్టికాహార స్థాయి, జీవన ప్రమాణాలను పెంచడం, ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చడం తన ప్రాథమిక విధులుగా ప్రభుత్వం పరిగణించాలి. (షల్ రిగార్డ్)" అని భారత రాజ్యాంగం ఆర్టికల్ 47 స్పష్టంగా పేర్కొంది. రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లో ఇది ఒకటి. పరిశ్రమలు నీటిలో వదిలే కాలుష్యాల ప్రాతిపదికగా సెస్ చెల్లించాలని నీరు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం 1976 స్పష్టం చేస్తోంది. పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థాలు, ఉద్గారాలకు సంబంధించిన పరిమితులపై పర్యావరణ పరిరక్షణ చట్టం (1986), అదే విధంగా ఆ చట్టం రూల్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నీటి నాణ్యతపై కూడా రూల్స్‌లో వివరించారు. పొల్యూటర్ పేస్ ప్రిన్సిపుల్ విషయమై వెల్లూరు సిటిజన్స్ ఫోరం కేసులో సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. కాలుష్య బాధితులకు నష్టపరిహారం చెల్లించడం మాత్రమేగాక దెబ్బతిన్న పర్యావరణాన్ని తిరగి పునరుద్ధరించేందుకు అయ్యే ఖర్చును చెల్లించడం కూడా కాలుష్య కారకుల (పొల్యూటర్) బాధ్యతేనని నిర్దేశించింది. దెబ్బతిన్న పర్యావరణాన్ని మెరుగుపర్చడం సుస్థిర అభివృద్ధి క్రమంలో భాగమేనని పేర్కొంది.

రాజ్యాంగం, చట్టాలు, సుప్రీం కోర్టు తీర్పు పేర్కొన్న విధంగా రొయ్యలు, చేపల చెరువులు, ఆక్వా ప్రోసెసింగ్ ప్లాంట్ల కారణంగా పర్యావరణానికి హాని కలిగిస్తున్న

యాజమాన్యాలే ప్రజలకు జరుగుతున్న నష్టాలను భర్తీ చేయాలి. ప్రజలందరికీ సురక్షితమైన త్రాగునీటిని అందించడం మొదలు సంపూర్ణమైన ఆరోగ్యం పొందదానికి అవసరమైన వైద్య ఖర్చులను సైతం వారే చెల్లించాలి. అంతర్జాతీయ న్యాయ సూత్రాలు, దేశ చట్టం, సర్వోన్నత న్యాయస్థానం తీర్పు మేరకు ప్రభుత్వం ఆక్వా యాజమాన్యాల మెడలు వంచాలి.

## ప్రజల కదలిక

చేపలు, రొయ్యల చెరువుల మూలంగా ఉమ్మడి త్రాగునీటి వనరులకు (మంచినీటి చెరువులు) నష్టం జరుగుతుండడంతో గ్రామాల్లో చేపలు, రొయ్యల చెరువుల త్రవ్వకానికి వ్యతిరేకంగా ప్రజలు బాగా కదులుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం మోగల్లు (అల్లూరు సీతారామరాజు స్వగ్రామం), ఉండి మండలం పాములపర్రు వంటి అనేక గ్రామాల్లో ప్రతిఘటన ఎక్కువగా వుంది. అలాగే చేపలు, రొయ్యల చెరువుల నుండి మురుగునీరు, ఉప్పునీరు వదిలేయడం మూలంగా చుట్టుప్రక్కలగల నారు మళ్ళు, పంట పొలాలు దెబ్బతిన్నాయి. తీవ్రంగా నష్టపోయిన రైతులు, కౌలుదార్లు ఆందోళన చేస్తున్నారు. (పశ్చిమగోదావరి జిల్లా నిడమర్రు మండలం అడవికొలను గ్రామం) తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం వన్నెచింతలపూడి, తాండవపల్లి గ్రామాల వారు హైకోర్టులో కేసు వేశారు. అనుమతి లేని చెరువులను ధ్వంసం చేయాలని పంట కోల్పోయిన రైతులకు, కౌలుదార్లకు నష్టపరిహారం చెల్లించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. చేపల చెరువుల్లో కలిపేసుకున్న తమ సొసైటీ భూములను తమకు అప్పగించాలని కోరుతూ నందివాడ మండలం ఇలపర్రు గ్రామ దళితులు సుమారు రెండేళ్ళుగా ఆందోళన చేస్తున్నారు. ఒక్క కృష్ణా జిల్లాలోనే ఇలా అన్యాక్రాంతమైన భూమి 28 వేల ఎకరాలకు పైబడి వుంటుందని అంచనా.

మంచినీటి వనరులకు నష్టం కలుగుతున్నందున చేపలు, రొయ్యల చెరువుల త్రవ్వకానికి వ్యతిరేకంగా గ్రామంలోని దళితులు, పేదలు ఎక్కువగా కదులుతున్నారు. పార్టీ అనుబంధాలకు అతీతంగా  ఆందోళనల్లో పాల్గొంటున్నారు. చేపలు, రొయ్యల చెరువుల నుండి విడిచిపెట్టే మురుగు నీటివల్ల పంట కోల్పోయిన/ దిగుబడి తగ్గిన సందర్భాల్లో ఆ చుట్టుప్రక్కలగల రైతులు, కౌలుదార్లు, కూలీలు ఇప్పటికి పశ్చిమగోదావరి తూర్పుగోదావరి కృష్ణా జిల్లాలో 100 గ్రామాలకు పైగా ప్రతిఘటనలో వున్నాయి. కృష్ణా జిల్లాలో ఈ కదలికలు ఇప్పుడు కొత్త కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి.

## ఉద్యమానికి సానుకూలత

భూస్వాములు, ధనిక రైతులు పెట్టుబడిపెట్టి గ్రామాల్లో రొయ్యలు, చేపల చెరువులు త్రవ్వి లాభాలు గడించుకుంటుంటే మిగిలిన అత్యధికమంది ప్రజలు కాలుష్యం, ఉపాధి లేమి, త్రాగునీటి కటకటతోపాటు వ్యాధులతో అల్లాడుతున్నారు. వ్యవసాయ కార్మికులు, కౌలుదార్లు, పేద, మధ్యతరగతి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. దళితులు, బలహీనవర్గాల ప్రజల బాధలు వర్ణనాతీతం. బాధిత ప్రజానీకం తమ కష్టాలకు కారణమైన ఆక్వా చెరువులు, ప్రోసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామాల్లో భూములను ఆక్వా క్రిందకు మార్చడానికి వీల్లేదని ఆందోళన చేసే రైతులున్నారు. కానీ ఆక్వా యజమానులను బలపర్చే పేదలు ఎక్కడా లేరు. అంతేకాదు సామాజికంగా వెనుకబడిన దళితులు ఆక్వా వ్యతిరేక ఉద్యమంలో ముందు పీఠిన ఉన్నారు. బలహీనవర్గాల ప్రజలు తోడవుతున్నారు. ఇది సానుకూల అంశం.

గ్రామం దాదాపు రెండుగా విభజింపబడుతోంది. ఆక్వా యజమానులు, లీజుదారులు, గ్రామాల్లో నివసించడంలేదు. ప్రత్యామ్నాయం లేని పేదలు మాత్రమే పూర్తిగా ఆక్వా మయం అయిన గ్రామాల్లో ఉంటున్నారు. వీరి మనుగడ గ్రామాల్లో ప్రశ్నార్థకమైంది. అందువల్ల వారంతా గ్రామం వదిలిపోవడమో లేక ఆక్వా విస్తరణకు వ్యతిరేకంగా పోరాడడమో జరగాలి. మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల న్యాయమైన పోరాటానికి ప్రజా సంస్థలు, రాజకీయ పక్షాలు మద్దతునిస్తే మరింతగా పోరాడుతారు. లేకపోతే గ్రామాలు వదిలి పోవాల్సివస్తుంది. ఇదీ నేటి పరిస్థితి.

# ప్రజల కోర్కెలు

1 చెరువుల అక్రమ త్రవ్వకాలను నివారించాలి.

2 రొయ్యలు, చేపల చెరువుల మూలంగా మంచినీటి వనరులు (చెరువులు, బోర్లు, బావులు) కలుషితమైన గ్రామాలలో మంచినీటిని ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలి.

3 రొయ్యలు, చేపల చెరువులలో కబ్జాకు గురైన ఇరిగేషన్ కాలువలు, డ్రెయిన్లను పునరుద్ధరించాలి.

4 చెరువుల్లో కలిపివేసిన (దురాక్రమణ చేసిన) ఎస్సీ, ఎస్టీ, బిసిలకు చెందిన డి-పట్టా, ప్రభుత్వ భూములను పేదలుకు అప్పగించాలి.

5 సిఏఏ/ డిఎల్‌సి ఇచ్చిన అనుమతి పత్రాన్ని సమీక్షించాలి. అన్ని వివరాలతో చేపలు, రొయ్యల చెరువు వద్ద బోర్డుపై విధిగా ప్రదర్శించాలి.

6 చట్ట విరుద్ధమైన చెరువులను ధ్వంసం చేయాలి. చేపలు, రొయ్యల చెరువుల త్రవ్వకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చట్టాలను, జి.వోలను తప్పనిసరిగా అమలు చేయాలి. అందుకు విరుద్ధంగా అనుమతులిచ్చిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలి.

7 రొయ్యల చెరువుల మూలంగా పంట నష్టపోయిన రైతులకు, కౌలుదార్లకు నష్టపరిహారాన్ని ఆయా చెరువుల యజమానులనుండి ప్రభుత్వం ఇప్పించాలి.

8 చేపలు, రొయ్యల చెరువులకోసం దరఖాస్తు వచ్చిన వెంటనే గ్రామ సభ నిర్వహించాలి. ఆ భూమి చుట్టు ప్రక్కల గల రైతులకు, కౌలుదార్లకు వ్రాతపూర్వక సమాచారాన్నిచ్చి వారి అభిప్రాయాలను/ అభ్యంతరాలను నమోదు చేయాలి. ప్రజల అభ్యంతరాలను పరిష్కరించాక డిఎల్‌సి ఆ భూములను ప్రత్యక్షంగా పరిశీలించాలి. తరువాత మాత్రమే ప్రాథమిక అనుమతిని మంజూరు చేయాలి.

9 పతి రొయ్యల చెరువు వద్ద వ్యర్థాలను శుద్ధిచేసే వ్యవస్థ (ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటు చేయాలి. వ్యర్థ జలాలను కాలుష్య నియంత్రణా మండలి ప్రమాణాలకు లోబడి మాత్రమే వదిలేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

10 ఆక్వా జోన్‌ల ప్రకటన వంటి చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

11 రొయ్యల చెరువుల్లో ఉప్పునీటి బోర్లను అనుమతించరాదు. ఇప్పటికే ఉన్నవాటిని తొలగించాలి. సెలినిటీ పెంచడంకోసం ఉప్పు వేయడాన్ని నిషేధించాలి.

12 సముద్ర తీరప్రాంతాల్లో తప్ప మిగిలినచోట్ల ఆక్వాకల్చర్ అనుమతించరాదు.

13 జనావాసాల సమీపంలో ఆక్వా ప్రోసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేయరాదు. తుందుర్రు ఆక్వా పార్కు రద్దుచేయాలి. ఇప్పటికే ఉన్న వాటి మూలంగా కాలుష్యం లేకుండా చర్యలు చేపట్టాలి.

14 మంచినీటి వనరులు, డ్రెయిన్‌లలోకి ఆక్వా నీటిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదు.

15 చేపలు, రొయ్యల ప్రోసెసింగ్ ప్లాంట్లలో పనిచేసే వారికి పూర్తి స్థాయి భద్రతా సౌకర్యాలు (సేఫ్టీ మెజర్స్) కల్పించాలి. కనీస వేతనాలు, పి.ఎఫ్, ఇఎస్ఐ మొ॥ అమలు చేయాలి.

16 ఊపిరితిత్తులు, చర్మ సంబంధిత వ్యాధులతో సహా ఇతర వృత్తి రుగ్మతలకు సంబంధించి కార్మికులందరికీ వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన వారికి యాజమాన్యం ఖర్చుతో వైద్యం చేయించాలి.

* * * *


ముద్రణ : మే, 2017 వెల : రూ. 5/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

# 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 2